క్లుప్తంగా

శ్రీలక్ష్మీనరసింహుడికి విశేష పూజలు



స్వామివారికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

గుర్రంకొండ : మండలంలోని తరిగొండ గ్రామంలో వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. శనివారం టీటీడీ ఆధ్వర్యంలో వేకువజామునే స్వామివారికి పలు రకాల నైవేద్యాలు సమర్పించి అభిషేకాలు, అర్చనలు చేశారు. తోమాల సేవ, ఏకాంతసేవ కావించారు. ఈసందర్భంగా స్వామివారిని పలురకాల రంగుల పుష్పాలతో అందంగా అలంకరించారు. భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి చేరుకొని స్వామివారిని దర్శించుకున్నారు. అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

ఘనంగా మళయప్పస్వామి ఊరేగింపు



గరుడవాహనంపై మళయప్పస్వామి ఊరేగింపు

పీలేరు రూరల్ : వైకుంఠ ఏకాదశి, ద్వాదశి పూజా కార్యక్రమాల్లో భాగంగా మళయప్ప స్వామి ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. స్థానిక కోటపల్లెలో శ్రీ పద్మావతి ఆండాల్ సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో రెండు రోజుల పాటు విశేష పూజల నిర్వహించారు. శనివారం స్వామి వారిని గరుడ వాహనంపై ప్రత్యేకంగా అలంకరించి ఊరేగింపు కార్యక్రమం చేపట్టారు. మంగళవాయిద్యాల నడుమ స్వామివారి ఊరేగింపు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్కానింగ్ యంత్రాలు స్వాధీనం



స్కానింగ్ యంత్రాలు తరలిస్తున్న అధికారులు

పీలేరు : అనుమతుల లేకుండా స్కానింగ్ సెంటర్ నిర్వహిస్తున్న నోబుల్ నర్సింగ్ హోంలో స్కానింగ్ యంత్రాలను జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. గతంలో నోబుల్ నర్సింగ్ సెంటర్‌లో స్కానింగ్ సెంటర్‌ను సీజ్ చేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు శనివారం స్కానింగ్ యంత్రాలను స్వాధీనం చేసుకుని జిల్లా కేంద్రానికి తరలించారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి ఉషశ్రీ, సీఐ యుగంధర్, వైద్య, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తే చర్యలు

కలకడ : సంక్రాంతి సంబరాల పేరుతో అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తే కఠిన చర్యలు, కేసులు తప్పవని ఎస్‌ఐ రామాంజనేయులు హెచ్చరించారు. శనివారం ఆయన మాట్లాడుతూ మండలంలో కోడిపందేలు, పేకాట ఆడరాదని, ఎక్కడైనా నిర్వహిస్తున్నట్లు తెలిస్తే వెంటనే స్థానిక ఎస్‌ఐ సెల్ నెంబర్ 9440900713కు సమాచారం అందించాలని కోరారు. పందెం కోళ్ల విక్రయించినా, కోడి కత్తులు తయారు చేస్తున్నట్లు తెలిపిన వారి సమాచారం గోప్యంగా ఉంచుతామన్నారు. పండుగను ప్రశాంతంగా, సంతోషంగా జరుపుకోవాలన్నారు.

రెండు ఆవులు చోరీ

బి.కొత్తకోట : స్థానిక పాశంవీధిలోని ఖాళీ స్థలంలో కట్టి ఉంచిన రెండు ఆవులు శుక్రవారం రాత్రి చోరీకి గురయ్యాయి. బాధితుడు జి.సుబ్రమణ్యం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టి సీఐ జీవన్ గంగనాథ్ బాబు తెలిపారు. రాత్రి 11.30 నుంచి శనివారం తెల్లవారుజాము 5 గంటల మధ్యలో గుర్తు తెలియని వ్యక్తులు రూ.1.20 లక్షల విలువైన ఆవులను చోరీ చేసి తీసుకెళ్లినట్టు బాధితుడు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేస్తున్నట్టు తెలిపారు.

సంతాపం



నివాళులు అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే చింతల

కలికిరి (వాల్మీకిపురం) : పట్టణ పరిధిలోని గాం. దీపేటకు చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు మల్లకుంట రమణ భార్య నారాయణమ్మ(56) మృతి చెందింది. సమాచారం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే చింతల శనివారం వారి ఇంటి కెళ్లి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నీళ్ళ భాస్కర్, వాల్మీకిపురం ఉప సర్పంచ్ బిడ్డల కేశవరెడ్డి, రెడ్డెప్ప తదితరులు మాజీ ఎమ్మెల్యే వెంట పాల్గొన్నారు.

చనిపోయినోళ్లు ఉపాధి పనులు చేశారు..!

- సామాజిక తనిఖీ సభలో వెలుగుచూసిన వింత వాస్తవాలు
- ఇద్దరు ఫీల్డ్‌అసిస్టెంట్లు, ఒక టెక్నికల్ అసిస్టెంట్ సస్పెన్షన్
- ఒక ఫీల్డ్ అసిస్టెంట్ శాశ్వత తొలగింపు
- రూ.12లక్షల మేరకు అవినీతి



ఉపాధిహామీ పనుల్లో జరిగిన అవినీతిపై సంజాయిషీకోరుతున్న పీడీ వెంకటరత్నం

గుర్రంకొండ : ఐదేళ్ల క్రితం చినిపోయిన వ్యక్తులు ఉపాధి హామీ పనులు చేశారు.. వారి పేర్లతో కూలి డబ్బులు కూడా డ్రా చేసుకొన్నారు. ఈ వింత సంఘటన సామాజిక తనిఖీ బహిరంగ సభలో శనివారం వెలుగు చేసింది. ఇందుకు సంబంధించి ఇద్దరు ఫీల్డ్ అసిస్టెంట్లు, ఒక టెక్నికల్ అసిస్టెంట్ సస్పెన్షన్, మరో ఫీల్డ్ అసిస్టెంట్‌ను విధుల నుంచి శాశ్వతంగా అధికారులు తొలగించారు. కాగా ఉపాధిహామీ పనుల్లో రూ. 12 లక్షల మేరకు అవినీతి జరిగినట్లు అధికారులు వెల్లడించారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక ఉపాధి హామీ కార్యాలయం వద్ద జిల్లా పీడీ వెంకటరత్నం ఆధ్వర్యంలో సామాజిక తనిఖీ బహిరంగ సభ నిర్వహించారు. ఈ ఏడాది మండల మొత్తం మీద రూ. 7.77 కోట్ల మేరకు ఉపాధి హామీ పనులు జరిగినట్లు పేర్కొన్నారు. గ్రామాల వారీగా జరిగిన ఉపాధి పనులు, అక్కడ జరిగిన అవినీతి సభలో చదివి వినిపించారు.

అవినీతి చిట్టా :

- శెట్టివారిపల్లె పంచాయతీ 2017లో పి. రామచంద్ర, ఇదే పంచాయతీలో 2019లో వెంకటప్ప అనే వ్యక్తులు మృతి చెందారు. అయితే వీరు ఉపాధిహామీ పనులు చేసినట్లుగా మస్టర్లలో చూపించి బినామీ పేర్లతో బిల్లులు స్వాహా చేశారు.
- 12 గ్రామాల్లో వేలిముద్రలు, కూలీల సంతకాలు లేకుండానే బినామీ పేర్లతో బిల్లులు చేసుకొని స్వాహా చేశారు.
- నాలుగు గ్రామాల్లో సమాచార బోర్డులు ఏర్పాటు చేయకుండానే చేసినట్లు చూపించి బిల్లులు స్వాహా చేశారు.
- శెట్టివారిపల్లె, అమిలేపల్లెతో పాటు మరో రెండు గ్రామాల్లో జరిగిన మినీ గోకులం, మొక్కల పెంపకం వంటి పథకాలకు సంబంధించిన మెటీరియల్ మొత్తాన్ని ఎల్లుట్ల ఫీల్డ్‌అసిస్టెంట్ బ్యాంక్ ఖాతాలో జమ చేసి బినామీ పేర్లతో స్వాహా చేశారు.
- ఎల్లుట్ల, అమిలేపల్లెతో పాటు మరో రెండు గ్రామాల్లో ఫాంపాండ్ పనుల్లో పలు అవినీతిజరిగిట్లు అధికారులు ప్రకటించారు. ఫాంపాండ్ పనుల కొలతల్లో భారీగా తేడాలు ఉండడంతో పాటు కొన్నిగ్రామాల్లో పనులు చేయకుండానే చేసినట్లు చూపించి బిల్లులు స్వాహా చేశారు.
- ప్రభుత్వ పాఠశాలలు, ట్రాన్స్‌కోలో పనిచేసే వారి పేర్ల మీద పనులు చేసినట్లు చూపి బిల్లులు డ్రా చేసుకొన్నారు.
- ప్రభుత్వ భూముల్లో ఫాంపాండ్ పనులు చేయడంతోపాటు రెండు చెరువుల్లో మినీ పర్కొలేషన్ ట్యాంకులు నిర్మించినట్లు చూపించి లేని పనులకు బిల్లులు చేసుకొన్నారు.
- మండలం మొత్తం మీద 15 గ్రామ పంచాయతీల్లో జరిగిన ఉపాధిహామీ పనుల్లో మొత్తం రూ. 12 లక్షల మేరకు అవినీతి జరిగినట్లు లెక్కతేల్చారు. కాగా శెట్టివారిపల్లె, ఎల్లుట్ల ఫీల్డ్ అసిస్టెంట్లు సిద్రమాన్, శంకరప్పలను సస్పెండ్ చేశారు. అమిలేపల్లె ఫీల్డ్‌అసిస్టెంట్ లోకనాథంను విధుల నుంచి శాశ్వతంగా తొలగించారు. కాగా టెక్నికల్ అసిస్టెంట్ రవినాయక్‌ను సస్పెండ్ చేసినట్లు పీడీ వెంకటరత్నం తెలిపారు. కార్యక్రమంలో ఏపీడీ లక్ష్మీనరసయ్య, ఎంపీడీఓ వెంకటేశులు, ఏపీవో జయరామిరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్‌ఎఈ లాల్‌స్వామి, ఇన్‌చార్జ్ హౌసింగ్ ఎఈ సయ్యద్, పంచాయతీ ఈఓ శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

పట్టాభిరామస్వామి సేవలో మాజీ ఎమ్మెల్యే



వాల్మీకిపురంలో పట్టాభిరామున్ని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే చింతల

కలికిరి (వాల్మీకిపురం) : వైకుంఠ ద్వాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి వాల్మీకిపురం పట్టణ పరిధిలోని పట్టాభి రామాలయంలో శనివారం ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ నూతన సంవత్సరం, సంక్రాంతి సందర్భంగా ప్రతి ఇంట్లో సుఖసంతోషాలు వెల్లువిరియాలని పట్టాభిరాములవారిని కోరినట్లు తెలిపారు. 13వ శతాబ్దం నాటి నుంచి ప్రాచుర్యం, మహత్యం కలిగిన పట్టాభి రామున్ని దర్శించుకోవడం నూతన ఏడాదిలో నూతన అనుభూతినిచ్చిందన్నారు. ఆలయ అర్చకులు మాజీ ఎమ్మెల్యేకి స్వాగతం పలికి అర్చన, ప్రత్యేక పూజలు చేసి ఆశీర్వదించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నీళ్ళ భాస్కర్, స్థానిక నాయకులు మాజీ ఎమ్మెల్యే వెంట పూజలలో పాల్గొన్నారు.

నేడు మదనపల్లెలో 'కుల దహనం' సభ

మదనపల్లె : భారతీయ అంబేడ్కర్ సేన (బాస్) 13వ వార్షికోత్సవాల్లో భాగంగా ఆదివారం మదనపల్లెలో ×కుల దహనం్ణ పేరుతో కుల నిర్మూలనా చైతన్య సభను నిర్వహిస్తున్నామని, సభకు బాస్ కార్యకర్తలు, నాయకులతోపాటు కుల నిర్మూలనావాదులు స్వచ్ఛందంగా తరలివచ్చి జయప్రదం చేయాలని సంస్థ వ్యవస్థాపకులు పీటీయం శివప్రసాద్ విజ్ఞప్తి చేశారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... భారతదేశాన్ని పట్టి పీడిస్తున్న అతి పెద్ద జబ్బు కుల వ్యవస్థ అని, అందుకే భారతదేశంలో అనేకమంది సంఘసంస్కర్తలు కుల నిర్మూలన కోసం ఉద్యమించారని, కుల దహనం పేరుతో బాస్ చేపట్టిన కుల నిర్మూలనా చైతన్య కార్యక్రమం దీనికి కొనసాగింపేనని ఆయన చెప్పారు. మధ్యాహ్నం 12–30గంటల నుంచి ×కుల దహనం్ణ సభ జరుగుతుందని తెలిపారు. సభకు తమిళనాడు నుంచి వీసీకే పార్టీ సౌత్ ఇండియా కో – ఆర్డినేటర్ బాలసింగం, కర్ణాటక నుంచి గవర్నమెంట్ ఆఫ్ కర్ణాటక జానపద అకాడమీ చైర్మన్ గొల్లహళ్లి శివప్రసాద్, దళిత సంఘర్షణ సమితి (ఈ) రాష్ట్ర అధ్యక్షులు ఎన్. వెంకటేష్, తెలంగాణ నుంచి వీసీకే పార్టీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ జిలుకర శ్రీనివాస్, విజయవాడ నుంచి సామాజిక విశ్లేషకులు దుర్గం సుబ్బారావు గారు, కర్నూలు నుంచి బహుజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు కొమ్ముపాలెం శ్రీనివాస్, అమరావతి నుంచి స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మేడికొండ సునీల్, యువ పారిశ్రామిక వేత్త మెండెం శ్రీనివాస్, వి. కోట నుంచి బాస్ స్టేట్ కన్వీనర్ ఉలగనాథన్ గణపతి తదితరులు ముఖ్య అతిథులుగా హాజరవుతారని తెలిపారు.

కులదహన సభకు తరలిరండి

బి.కొత్తకోట : భారతీయ అంబేడ్కర్ సేన 13వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం మదనపల్లెలో నిర్వహించే కులదహన సభకు ప్రజలు తరలిరావాలని బాస్ జిల్లా నాయకులు సచిన్, కోరారు. శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలు హాజరై జయప్రదం చేయాలని కోరారు. బాస్ నాయకులు వెంకటేష్, మణీ, మాధవ, రామాంజీ పాల్గొన్నారు.

కర్ణాటక సరిహద్దుకు రోడ్డు నిర్మాణం

అటవీప్రాంతంలో సాధ్యాసాధ్యాలను పరిశీలించిన ఎమ్మెల్యే

మదనపల్లె : మండలంలోని కోళ్లబైలు పంచాయతీ మిట్టామర్రి మీదుగా అటవీప్రాంతంలో కర్ణాటక సరిహద్దు వరకు రోడ్డు నిర్మాణానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అన్నారు. శనివారం కోళ్లబైలు పంచాయతీలో మిట్టామర్రి గ్రామం నుంచి కాలినడకన అటవీప్రాంతంలో మూడున్నర కిలోమీటర్ల మేర నడుచుకుని వెళ్లి రోడ్డు ఏర్పాటుకు సాధ్యాసాధ్యాలను పరిశీలించారు. కర్ణాటకకు చేరుకున్న తర్వాత శ్రీనివాసపురం ఎమ్మెల్యే వెంకటశివారెడ్డితో సమావేశమయ్యారు. ఆంధ్ర, కర్ణాటక రాష్ట్ర సరిహద్దులను కలుపుతూ అటవీప్రాంతంలో రహదారి ఏర్పాటుకు సహకరించాల్సిందిగా వినతిచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... కోళ్లబైలు పంచాయతీలోని ప్రజలు కర్ణాటకలోని తమ బంధుమిత్రులను కలుసుకునేందుకు, రాకపోకలు సాగించేందుకు అటవీప్రాంతంలో దారి లేకపోవడంతో చుట్టూ తిరిగి వ్యయప్రయాసలు పడాల్సి వచ్చేదన్నారు. దీంతో వారు పలుసార్లు రోడ్డు ఏర్పాటుపై తన దృష్టికి తెచ్చారని, ఈ విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి వారి కల సాకారం చేసేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో కోళ్లబైలు సర్పంచ్ ఆనంద్‌రెడ్డి, టీడీపీ నాయకులు జె.వి.రమణ, జేసీబీ వేణు, రాయచోటి శశికుమార్, జీవి.నాయుడు, కమలమర్రి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మినీ గోకులాలను సద్వినియోగం చేసుకోండి



మినీ గోకులం షెడ్లు ప్రారంభిస్తున్న ఇన్‌చార్జి ఏపీఓ, తదితరులు



కలకడ : గోకులం షెడ్లను ప్రారంభిస్తున్న ఎంపీడీఓ, తదితరులు

పీలేరు రూరల్ : పాడిరైతులు మినీ గోకులం షెడ్లను సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌చార్జి ఏపీఓ సుధాకర్ అన్నారు. శనివారం మండలంలోని కాకులారంపల్లె పంచాయతీ తుమ్మలవాండ్లపల్లె, బాలంవారిపల్లె, తలపుల పంచాయతీ అడవిపల్లెలో మినీగోకులం షెడ్లు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మినీ గోకులం ఏర్పాటుతో పాడి పశువులకు వాన, ఎండలకు వడదెబ్బలకు గురి కాకుండా ఆరోగ్యంగా ఉంటాయన్నారు. పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సింగిల్‌విండో అధ్యక్షుడు రెడ్డెప్పరెడ్డి, నారదముని, సురేంద్ర రెడ్డి, రామచంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పశువుల సంరక్షణ కోసం గోకులం షెడ్లు

కలకడ : పశువుల సంరక్షణ కోసం గోకులం షెడ్లను పాడి రైతులకు ప్రభుత్వం మంజూరు చేస్తోందని, వీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ అబ్దుల్‌రహీం, మండల కోఆప్షన్ సభ్యులు ఇనాయతుల్లా కోరారు. శనివారం కలకడ పంచాయతీలో నిర్మాణం పూర్తియిన గోకులం షెడ్డును ప్రారంభించి పశువులకు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఏపీఓ చెన్నకేశవులు, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

పార్టీ అభివృద్ధికి కృషి చేస్తాం



ఎంపీ మిథున్ రెడ్డితో సీహెచ్ రామచంద్రారెడ్డి, మండల నాయకులు

రామసముద్రం : వైఎస్సార్ సీపీ అభివృద్ధికి సమష్టిగా కృషి చేస్తామని జిల్లా కమిటీలో సముచిత స్థానం దక్కిన జిల్లా ఉపాధ్యక్షుడు సిహెచ్. రామచంద్రారెడ్డి, జిల్లా సెక్రటరీ యాక్టివిటి నందకిశోర్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్ రెడ్డిలను వారు పుంగనూరులో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమితులైన సిహెచ్. రామచంద్రారెడ్డి మదనపల్లిలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇంచార్జి నిసార్ అహమ్మద్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దేశాయి తిప్పారెడ్డిలను మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీ, మాజీ మంత్రి రామసముద్రం మండల స్థితిగతులపై అడిగి తెలుసుకున్నారు. త్వరలోనే మండలంలో కార్యకర్తల సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీ తెలిపారు. వైస్ ఎంపీపీ రమణారెడ్డి, నాయకులు కేశవరెడ్డి, ప్రకాష్, బాలాజీ, రెడ్డి వీరేగౌడు, శివ, కొమ్ము నారాయణ స్వామి, జెకె. చంద్ర, హరి, సర్దార్ తదితరులు ఉన్నారు.

పాడి రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

నిమ్మనపల్లె : పాడి రైతుల అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే షాజహాన్ బాష అన్నారు. శనివారం మండలంలోని బండ్లపై లో రూ.2.30 లక్షల నిధులతో నిర్మాణం పూర్తయిన గోకులం షెడ్లను స్థానిక నాయకులు అధికారులతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ఇప్పటివరకు 25 గోకుల షెడ్లను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. దాదాపు 90 శాతం ప్రభుత్వం రైతులకు సబ్సిడీ రూపంలో అందిస్తోందన్నారు. పాడి రైతులు నిర్మాణాలను పూర్తి చేసి, పథకం యొక్క ప్రయోజనాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా పశుగ్రాసం పెంచుకునే పాడి రైతులకు ప్రభుత్వం రెండు సంవత్సరాల వరకు ఆర్థిక సాయం అందిస్తుందన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సుజాత, రాచవేటివారిపల్లె సర్పంచ్ సుబ్రహ్మణ్యం, టిడిపి నాయకులు ఆర్ జే వెంకటేష్, ఎంపీడీఓ పరమేశ్వర్ రెడ్డి, పశు వైద్యాధికారి డాక్టర్ సురేష్, ఏవో రమేష్ బాబు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మిధున్ చక్రవర్తి, తదితరులు పాల్గొన్నారు.

వడ్డె ఓబన్న చరిత్ర చిరస్మరణీయం



పెద్దతిప్పసముద్రం : వడ్డెర ఓబన్న జయంతి నిర్వహిస్తున్న నాయకులు



బి.కొత్తకోట: పేదలకు అన్నదానం

మదనపల్లె : తొలితరం స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డె ఓబన్న చరిత్ర చిరస్మరణీయమని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అన్నారు. శనివారం వడ్డె ఓబన్న 218వ జయంతి సందర్భంగా పట్టణంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. వడ్డె ఓబన్న నిలువెత్తు చిత్రపటాన్ని ట్రాక్టర్‌లో ప్రత్యేకంగా ఏర్పాటుచేసుకుని, నీరుగట్టువారిపల్లె రింగ్‌రోడ్డు చౌడేశ్వరి సర్కిల్ నుంచి పట్టణ పురవీధుల్లో వడ్డెరలు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని ఎమ్మెల్యే జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ఉయ్యాలవాడ నరసింహారెడ్డికి వ్యక్తిగత సైనికుడిగా ఉండి, బ్రిటీషు వారిపై వడ్డె ఓబన్న జరిపిన పోరాట పటిమ స్ఫూర్తిదాయకమన్నారు. ఓబన్న లాంటి పోరాట యోధుల చరిత్రను నేటితరం తెలుసుకుని స్ఫూర్తిని పొందాలన్నారు. ఓబన్న పోరాట స్ఫూర్తిని భావితరాలకు చాటిచెప్పాలని పిలుపునిచ్చారు. బీజేపీ నాయకులు బండి ఆనంద్, వి.నారదరెడ్డి, వాల్మీకిసంఘం శ్రీనివాసులు, వడ్డెరసంఘం నాయకులు పాల్గొన్నారు.

రామసముద్రంలో..

రామసముద్రం : మండల కేంద్రంలో శనివారం స్వాతంత్ర సమరయోధుడు వడ్డే ఓబన్న 218జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండల వడ్డెర సంఘం అధ్యక్షులు రెడ్డెప్ప, జిల్లా కార్యదర్శి ఆర్. వాలెప్ప, దాసార్లపల్లె మంజు వడ్డెర కులసంఘం పెద్దలు ఆధ్వర్యంలో ఓబన్న చిత్ర పటానికి పూలమాలలు వేసి కేక్ కట్ చేసి ఘనంగా నివాళులు అర్పించి ఓబన్న సేవలను కొనియాడారు. కార్యక్రమంలో బీజేపీ శ్రీనివాస్, మహేష్, వెంకటరమణ, పూజారి గంగప్ప, మంజునాథ్, యల్లప్ప, వెంకటప్ప, తదితరులు పాల్గొన్నారు.

వడ్డె ఓబన్న ఆశయాలు ఆదర్శం

తంబళ్లపల్లె : స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డె ఓబన్న ఆశయాలు సమాజానికి ఆదర్శమని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చౌడేశ్వర్ అన్నారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో వడ్డె ఓబన్న జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఓబన్న చిత్రపటానికి పూలమాలలతో పూజలు చేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో రామ్‌లాల్, కృష్ణమూర్తి, పూజారివెంకటరమణ, రేపన వెంకటరమణ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. ఆదేవిధంగా మండల వడ్డెరసంఘం ఆధ్వర్యంలో వడ్డె ఓబన్న జయంతి వేడుకలను వడ్డెరసంఘం అధ్యక్షులు మల్లికార్జున ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆయన స్వాతంత్రోద్యమ పోరాట సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పెద్దేరు ప్రాజెక్ట్ ఆయకట్టుసంఘం చైర్మన్ కొటాలశివకుమార్, లక్ష్మీపతి, ఎంఎస్ అధ్యక్షురాలు రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పోరాట యోధుడు వడ్డెర ఓబన్న

పెద్దతిప్పసముద్రం : స్వాతంత్ర్య పోరాటంలో వడ్డెర ఓబన్న పోరాటం వీరోచితమని ఎంపీపీ మహమూద్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో వైఎస్సార్‌సీపీ నాయకుల ఆధ్వర్యంలో వడ్డెర ఓబన్న జయంతి ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఓబన్న చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఓబన్న పోరాట స్ఫూర్తిని భావి తరాలకు చాటి చెప్పాలని పిలుపు నిచ్చారు. ఎన్‌హెచ్‌ఏఏ ఫీల్డ్ లెవల్ కౌన్సిలర్ కేవీ రమణ, స్థానిక ఎంపీటీసీ కార్యం చంద్రశేఖర్, సర్పంచ్ బుచ్చిగారి సుబ్బిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఆనంద్‌రెడ్డి, మంజు, ఆదిరెడ్డితో పాటు వడ్డెర సంఘం కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా వడ్డే ఓబన్న జయంతి

బి.కొత్తకోట : బి.కొత్తకోట, తాకాటంవారిపల్లెల్లో శనివారం వడ్డే ఓబన్న జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. బ్రిటిష్ ఈస్టిండియా కంపెనీకి వ్యతిరేకంగా పోరాటం చేసిన ఓబన్న గొప్ప యుద్ధ మోధుడని కొనియాడుతూ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి పేదలకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమాల్లో మల్లికార్జున నాయుడు, వడ్డెర సాధికార సంఘ అధ్యక్షుడు దేరంగుల నారాయణ, కే.నాగమల్లప్ప, టి.పద్మనాభం, కే.నాగరాజు, ఈ.చంద్ర, చౌడప్ప, హరి, పూజారి శ్రీనివాసులు, శంకర, సాంబ, రమణ, మోహన, నారాయణ, మునెప్ప, రామచంద్ర, శంకర, రమణప్ప పాల్గొన్నారు.

ముందస్తు సంక్రాంతి సంబరాలు

మదనపల్లె : పట్టణంలోని శ్రీ జ్ఞానాంబిక డిగ్రీ కళాశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. కళాశాల కరస్పాండెంట్ డాక్టర్. రాటకొండ గురు ప్రసాద్ ఆధ్వర్యంలో సంప్రదాయ దుస్తులు ధరించిన విద్యార్థినులు ముత్యాల ముగ్గులు వేసి, పొంగళ్ళు వండి అలరించారు. ప్రజలందరికీ భోగభాగ్యాలు అందించాలని, బోగి మంటలు చుట్టూ తిరుగుతూ పాటలు పాడారు. మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలు మరచి పోకుండా గుర్తుచేసేందుకు సంబరాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సురభి రమాదేవి అధ్యాపకులు, ఎన్‌ఎస్‌ఎస్ అధికారులు ఉదయ్, హిమశేఖర, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

సర్పంచ్‌లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్



మాట్లాడుతున్న సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి టి.ఎల్. వెంకటేష్

పీలేరు : పీలేరు గ్రామ పంచాయితీలో నిధులు దుర్వినియోగంలో అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న సర్పంచ్‌లపై చర్యలు తీసుకోవాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి టి.ఎల్. వెంకటేష్ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక మార్కెట్ యార్డులో విలేకరులతో మాట్లాడుతూ గడిచిన మూడున్నర సంవత్సరాల కాలంలో పీలేరు పంచాయతీ కార్యాలయంలో అవినీతి జరిగిందని ఆరోపించారు. జిల్లా అధికారులు విచారణ జరిపి ముగ్గ పంచాయతీ కార్యదర్శులను సస్పెండ్ చేశారన్నారు. అయితే రూ. 1.45 కోట్లు అవినీతి జరిగితే ఈ కాలంలో సర్పంచ్‌లుగా ఉన్న వ్యక్తులపై ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. ఉన్నతాధికారులు స్పందించి దుర్వినియోగం అయిన నిధులు తిరిగి రాబట్టాలని కోరారు. కార్యక్రమంలో వినోద్‌నాయుడు, భాస్కర్‌రెడ్డి, పరదేశి, రమేష్, చెంగన్న, సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

ఫిబ్రవరి 6 నుంచి ఏఐవైఎఫ్ మహాసభలు

రైల్వేకోడూరు అర్బన్ : ఫ్రిబ్రవరి 6, 7, 8, 9వ తేదీలలో ఏఐవైఎఫ్ మహాసభలను శ్రీకాకుళంలో నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దార్లరాజశేఖర్, వెంకటేష్, సీపీఐ ఏరియా కార్యదర్శి చిన్నయ్య తెలిపారు. స్థానిక కార్యాలయంలో శనివారం గోడపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహాసభలకు కార్మికులు, విద్యార్థులు, ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జాఫర్, హరి, కుమార్, నరశయ్య, తదితరులు పాల్గొన్నారు.

మహా విష్ణువు కల్యాణం

రామాపురం : మండలంలోని కంభరాయుడిగుట్టపై కొలువుదీరిన శ్రీదేవి, భూదేవి సమేత మహావిష్ణువు ఆలయంలో స్వామి వారి కల్యాణ వేదపండితుల మంత్రోచ్ఛరణ మధ్య కమనీయంగా సాగింది. అనంతరం మహాపూర్ణాహుతి, కలశ ఉద్వాసనం, మహా కుంబాభిషేకం, రుద్రాభిషేకం, పుష్కరిణిలో సుదర్శన చక్ర తళ్వార్, చక్రస్నానం నిర్వహించారు. ఆలయ కార్యనిర్వాహకులు ముక్కోటి బసిరెడ్డి, రామాంజుల్‌రెడ్డి కుటుంబీకుల ఆధ్వర్యంలో కల్యాణం జరిగింది. కార్యక్రమంలో అధికారులు, నాయకులు పాల్గొన్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే గడికోట ద్వారకనాథరెడ్డి సతీసమేతంగా వచ్చి ప్రత్యేక పూజలను నిర్వహించారు. అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఉపాధ్యాయులే.. సమాజానికి మూల స్తంభాలు



ఉపాధ్యాయుడికి బ్రోచర్ అందజేస్తున్న చొప్పా గంగిరెడ్డి

రాజంపేట : ఉపాధ్యాయులే.. సమాజానికి మూలస్తంభాలు అని అన్నమాచార్య విశ్వవిద్యాలయం ఛాన్సలర్ చొప్పాగంగిరెడ్డి అన్నారు. ఏయూ అనుబంధసంస్థ అన్నమాచార్య బీఈడీ కాలేజీలో ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు శనివారం శిక్షణ తరగతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు బోధిస్తూనే, పదోన్నతి దిశగా విద్య అభ్యసించడం అభినందనీయం అన్నారు. ఏఐటీఎస్ వైస్ చైర్మెన్ చొప్పాఎల్లారెడ్డి మాట్లాడుతూ సమాజానికి నాణ్యమైన ఉపాధ్యాయులను అందించడంలో అన్నమాచార్య యూనివర్సిటీ ముందంజలో ఉంటుందన్నారు. అన్నమాచార్య బీఈడీ కళాశాల ప్రిన్సిపల్ డా.జయరామిరెడ్డి మాట్లాడుతూ ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు అంబేడ్కర్ ఓపెన్ యూనవర్సిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక తరగతులను నిర్వహించామని పేర్కొన్నారు. ఉపాధ్యాయులకు బ్రోచర్లను అందజేశారు. చొప్పా అభిషేక్‌రెడ్డి, పాల్గొన్నారు.

అందరి సహకారంతో ఉత్సవాలు

ఏఐటీఎస్ సిల్వర్ జూబ్లీ ఉత్సవాలను అందరి సహకారంతో నిర్వహించగలిగామని అన్నమాచార్య యూనివర్సిటీ ఛాన్సలర్ చొప్పాగంగిరెడ్డి, ప్రో ఛాన్సలర్ చొప్పాఅభిషేక్‌రెడ్డి, ఏఐటీఎస్ వైస్ చైర్మెన్ చొప్పా ఎల్లారెడ్డి పేర్కొన్నారు.

నల్ల గంగమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట

సుండుపల్లె: మండలంలోని గొల్లపల్లి గ్రామంలో నల్లగంగమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట శనివారం ఘనంగా నిర్వహించారు. ఉదయాన్నే అమ్మవారికి ప్రత్యేక పూజలు, బంగారు ఆభరణాలతో అలంకరించి ప్రాణ ప్రతిష్ట చేశారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు ఆలయాన్ని విద్యుద్దీపాలు, చాందినీబండ్లు అలంకరించి ఊరేగించారు.